క్లుప్తంగా

ఎస్ఐకి సన్మానం

పెబ్బేరు రూరల్: నూతన ఎస్ఐగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన హరిప్రసాద్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మన్యం, కురుమూర్తిసాగర్, ఆశన్ననాయుడు, ఆనంద్‌సాగర్, సాయిరెడ్డి, జయపాల్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, సూగూరు శివ, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలి



పాన్‌గల్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి అశోక్‌నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని మాందాపూర్ గ్రామాన్ని సందర్శించి సమస్యలపై ఆరా తీసి నర్సరీ, ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

రేవల్లి ఎస్ఐగా తిరుపతిరెడ్డి



గోపాల్‌పేట: రేవల్లి మండల ఎస్ఐగా సోమవారం తిరుపతిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లా పదిర మండల ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో రేవల్లి ఎస్ఐగా విధులు నిర్వహించిన శివకుమార్ పెద్దమందడి మండలానికి బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అమరచింత ఎస్ఐగా సురేష్ ..



అమరచింత: మండల నూతన ఎస్ఐగా సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధు నిర్వహించిన జగన్మోహన్ లింగాల మండల ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. పెంట్లవెల్లి ఎస్ఐగా విధులు నిర్వహించిన సురేష్ వనపర్తి ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్నారు. ప్రస్తుతం అమరచింత మండల ఎస్ఐగా బదిలీపై వచ్చారు.

వనపర్తి టౌన్ ఎస్ఐగా జయన్న..



పెబ్బేరు రూరల్: వనపర్తి టౌన్ ఎస్ఐగా జయన్న, రూరల్ ఎస్ఐగా జలంధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐలు నాగన్న దేవరకద్రకు, యుంగధర్‌రెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 13వ వార్డు రాంనగర్ కాలనీలో కరెంట్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక కౌన్సిలర్ పుట్టపాకల మహేష్ ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం అందజేశారు. రాంనగర్ కాలనీలో అసంపూర్తిగా మిగిలిన కరెంట్ పనులు, ఇనుప స్తంభాలు, టూ పేస్ కరెంట్, ఇళ్లపై ఉన్న కరెంట్ వైర్ల సమస్యల పరిష్కారం కోసం విన్నవించుకున్నట్లు మహేష్ పేర్కొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, యూనియన్ నాయకులు ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

అ'పూర్వ' కలయిక

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల జెడ్పీహెచ్‌లో 2007–08 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం వారు చదువుకున్న పాఠశాలలోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు వారికి పాఠాలు చెప్పిన హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయప్రద, జనార్దన్, శ్రీవిద్య, అమృతరాజ్, వెంకటలక్ష్మి, బుచ్చన్నను పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.



అడ్డగోలుగా చెట్ల నరికివేత

- ఇటుక బట్టీలకు తరలిస్తున్న వైనం
- మామూళ్ల మత్తులో అధికారులు
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు



దంతనూరు శివారులోని ఇటుక బట్టీ వద్ద ఉంచిన కట్టెలు

మదనాపురం: మండలంలో కొన్ని రోజులుగా చెట్ల నరికివేత జోరుగా సాగుతోంది. కొంతమంది అక్రమ వ్యాపారులు చెట్లను నరికి కట్టెలను ఇటుక బట్టీలకు చేరవేస్తున్నారు. ఇటుక బట్టి వ్యాపారులు కట్టెలను ఇష్టారాజ్యంగా తీసుకొచ్చి కాల్చుతున్నారు. గ్రామీణా ప్రాంతాల్లో చెట్ల పెంపకం కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుపెట్టి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా.. అధికారులు నెల మామూళ్లకు అలవాటు పడడంతో ప్రభుత్వ లక్ష్యానికి గండిపడుతోంది. కట్టెల వ్యాపారులకు ఫారెస్టు అధికారులు అన్ని రకాలుగా అండదండలు అందిస్తుండడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా ఉంది.

పొట్టుకు అధిక ఖర్చు..

వరి పొట్టు కొనుగోలు చేయడానికి బహిరంగ మార్కెట్‌లో రేటు ఎక్కువగా ఉండడంతో ఇటుక బట్టీల నిర్వాహకులు కట్టెలు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు కలపను విచ్చలవిడిగా తరలిస్తున్నారు. కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, మదనాపురం మండలాలకు చెందిన వారు ఈ కలప దందాలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కొంతమంది కట్టెల మిషన్ల వ్యాపారులు కూడా వేప, తుమ్మ, మద్రి, చింత, కానుగ, తదితర రకాల చెట్లను నరికి తెస్తున్నారు. ఈ విషయమై 'సాక్షి' ఫారెస్టు అధికారులను వివరణ కోరగా తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి చెట్ల నరివేతకు అడ్డుకట్ట వేసి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు విస్మరించి.. విమర్శలు చేస్తారా?



కొత్తకోట చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- ఉద్యమాలు కొత్తకాదు
- అభివృద్ధికి సహకరిస్తాం
- జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయాలని ప్రశ్నిస్తే ఉద్యమనేత కేసీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కొత్తకోట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వామన్‌గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టడంతో వేలాది మంది ఆటో కార్మికులు రోడ్డును పడ్డారని వాపోయారు. ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారి సంక్షేమం గురించి ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. రైతులకు 24గంటల కరెంట్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ 15గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. అంతకు ముందుకు పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వివాదం జరగడంతో పాటు ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆకుల శ్రీను, సాక బాలనారాయణ, ఎద్దుల నాగేష్, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, సత్యంయాదవ్, రాములుయాదవ్, సుబాష్, బాబురెడ్డి, అయ్యన్న, భాస్కర్, బాబా, నరేష్‌గౌడ్ ఉన్నారు.

రూ.2.25 లక్షల సీఎంఆర్‌ఎఫ్ అందజేత

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లికి చెందిన చిన్ననాగయ్యకు మంజూరైన రూ.2.25 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని సోమవారం సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగయ్యకు మెరుగైన వైద్యం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక కృషితో ఎల్‌ఓసీ మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. మంజూరైన ఎల్‌ఓసీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు.

ఆర్థికసాయం



పెబ్బేరు రూరల్: మండలంలోని తోమాలపల్లికి చెందిన ఎండీ లాల్ బహదూర్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.5 వేలు పంపించడంతో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్, రంగన్నయాదవ్, మహదేవ్‌యాదవ్, రామన్‌గౌడ్, రాములు నాయుడు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, నగదును అందించారు. కార్యక్రమంలో బీచుపల్లియాదవ్, రాముడు, ఉమేష్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్



కొత్తకోట రూరల్: పట్టణంలోని 6వ వార్డులో కాంగ్రెస్ నాయకులు బుధవారం బోరు వేయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దేవరకద్ర ఎమ్మెల్యేగా జి.మధుసూదన్‌రెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 6వ వార్డులోని తాగునీటి సమస్య లేకుండా బోరు వేయిస్తానని వార్డు ఇన్‌చార్జ్ జేసీబీ రాముసాగర్ కాలనీవాసులకు వాగ్దానం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం బోర్‌వెల్‌ను తెప్పించి సొంత ఖర్చులతో బోరు వేయించాడు. ఇచ్చిన మాట ప్రకారం బోరు వేయించిన జేసీబీ రాముసాగర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, గొల్లరాము, సాయిలు యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తొలిమెట్టు కార్యక్రమం, ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల కనీస సామర్థ్యాలు సాధించేలా విద్యార్థుల చేత వర్క్ షీట్ల ప్రాక్టీస్ చేయించడం వంటి అంశాలపై చర్చించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల వారీగా ఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్పీలు రామదాసు, బండిశ్రీను, రాఘవేంద్ర, సురేందర్‌రెడ్డి సీఆర్పీలు గోవింద్, భార్గవి, రమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించేలా విద్యార్థులచే వర్క్ షీట్లను ప్రాక్టీస్ చేయించాలని ఏఎంఓ మహనంది సూచించారు. ఆయన సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమం నిర్వహణలో ఎఫ్ఎల్ఎన్ అమలు పాటించాల్సిన విషయాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగేంద్రంగౌడ్, కాంప్లెక్స్ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు నియంత్రించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్

వనపర్తి టౌన్: పాలమూరు యూనివర్సిటీలో, అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలో అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే ఉస్మానియా యూనివర్సిటీ పెద్దదని, అందులో సైతం లేనటువంటి ఫీజులు పాలమూరు యూనివర్సిటీలో ఉన్నాయని వాపోయారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించాలని, సరైన వసతులు లేని డిగ్రీ, పీజీ కళాశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను వెంటనే రెగ్యూలర్ కోర్సులుగా మార్చాలని, పాలమూరు యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్లను బలోపేతం చేయడమే కాకుండా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని నూతనంగా ఎన్నికైన సమాచార హక్కు చట్టం ఆర్టీఐ రాష్ట్ర వైస్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ అన్నారు. ఆయన సోమవారం పెబ్బేరులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాంపురం సహదేవుడు, జయపాల్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా పాండురంగ..

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిప్పుడంపల్లి పాండురంగను ఎంపిక చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రం అందించారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో పాండురంగను నాయకులు అభినందించారు.

బాధ్యతలు స్వీకరణ

కొత్తకోట రూరల్: ఈనెల 1న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో మండలంలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. మండలంలోని నాటవెల్లి, నిర్వేన్, రాయిణిపేట గ్రామాలకు ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ బాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నిర్వేన్‌లో తహసీల్దార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను గ్రామస్తులు, మాజీ సర్పంచ్ విశ్వనాథం, వార్డు సభ్యులు కలిసి శాలువాలతో సత్కరించారు. గ్రామాభివృద్ధి కోసం తామంతా అండగా ఉంటామన్నారు.

సీఐ శివకుమార్‌కు సన్మానం

ఆత్మకూర్: స్థానిక సీఐగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్‌ను సోమవారం మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు ఆధ్వర్యంలో యువకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రవి, బాలు, కమల్, నర్సింహ, ఇమ్రాన్, రాజేష్, సుబ్బు, జగదీష్, కిట్టు, ఖాజ, జుబేర్, సామిత్ ఉన్నారు.

తండావాసుల సహకారం మరువలేనిది



పాన్‌గల్: ఐదేళ్ల పాటు తండా అభివృద్ధిలో స్థానికులు అందించిన సహకారం మరువలేనిదని తెల్లరాళ్లపల్లితండా మాజీ సర్పంచ్ శాంతమ్మ, మాజీ ఉపసర్పంచ్ బుజ్జమ్మ అన్నారు. సోమవారం తండాలో పాలక మండలి మాజీ సభ్యులను తండావాసులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తండావాసుల సహకారంతోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీపీ ప్రత్యేకాధికారి విద్యాసాగర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బిల్యానాయక్, పంచాయతీ కార్యదర్శి నర్మద, బాల్యానాయక్, బాలునాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలం సర్వే

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో గౌడ సంఘం సొసైటీ స్థలం కబ్జాకు గురైందని గౌడ సొసైటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్, ఎమ్మెల్యే, తహసీల్దార్ ఆదేశానుసారం రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన స్థలాన్ని ఆర్ఐ తిరుపతయ్య సిబ్బందితో కలిసి సర్వే చేయించారు. 118 సర్వే నంబర్‌లో ప్రజలు ఎన్ని ఇండ్లు కట్టుకున్నారు. ఇంకా ఎంత స్థలం మిగిలింది అనే నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా గౌడ సంఘాలనికి కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా కాపాడాలంటూ పలువురు కోరుతున్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వనపర్తిలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

పాన్‌గల్: గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య అన్నారు. సోమవారం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములుకు వినతిపత్రం అందజేశారు.

సమ్మెను జయప్రదం చేయాలి..

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము అన్నారు. సమ్మె కారణంగా కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంటు వరమ్మ, ఏపీఓ కుర్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుగ్రీవుడు, రంగస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపు నిచ్చారు. సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని తిరుమల కాలనీలో భీసన్న అధ్యక్షతన కార్మికుల వీధి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రధానికి పంపడానికి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, చిన్నయ్య, శంకర్, మన్యం, నాగేంద్రం, స్వామి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో కేతేపల్లి విద్యార్థి ప్రతిభ



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సోషల్ ఫోరం టాలెంట్ టెస్టులో మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి ఆంగ్ల మాధ్యమం విద్యార్థిని యశోద ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సమావేశంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ విద్యార్థికి బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ యశోదను మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రథమ బహుమతి సాధించడంలో సాంఘిక ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ సాధించిన విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ పాఠశాల స్థలం పరిశీలన

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం గోపాల్‌పేట గ్రామస్తులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పరిశీలించారు. పాఠశాల స్థలం కబ్జాకు గురైందని పాఠశాల అధ్యాపకులు గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లడంతో సోమవారం గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాఠశాల వద్దకు చేరుకుని పాఠశాల ఎదురుగా పనులు జరుగుతున్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారి స్థలం ఎంతవరకు ఉందని, పాఠశాల స్థలం హద్దులు చూశారు. అనంతరం కోదండరామస్వామి వైపు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. రికార్డు ప్రకారం ఎక్కడి వరకు పాఠశాల స్థలం ఉంటే అక్కడి వరకు ప్రహరీ నిర్మించాలని అందరూ కోరగా.. అక్కడ తాము తాతల కాలం నుంచి గడ్డివాములు పెట్టుకుని ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నామని, ప్రస్తుతం ఉన్న వరకు ఉంచి ప్రహరీ కట్టుకోవాలని కోరారు. రికార్డు ప్రకారం అయితే హనుమాండ్ల గడ్డ కాలనీ మొత్తానికి అప్పటి రాణి రంగనాయకమ్మ ఆలయం కోసం ఇచ్చిందని, అక్కడ ఇప్పటికే వందల ఇళ్ల నిర్మాణాలు జరిగాయని అదంతా తీసుకుంటారా అని ప్రశ్నించారు. మంగళవారం మరోసారి గ్రామస్తులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, కాలనీవాసులు అందరూ పరిశీలించిన తర్వాత హద్దులు పాతి గోడ నిర్మించనున్నట్లు తెలిసింది.

ఐహెచ్‌ఆర్‌ఓ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన జిల్లా కమిటీ సభ్యులు

వనపర్తి టౌన్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్‌ఆర్‌ఓ) జిల్లా కమిటీని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జీటీ శ్యామ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో సమావేశమై ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా చింతకుంట విశ్వం బాబు, జనరల్ సెక్రెటరీగా గద్వాల ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్, కోశాధికారిగా అక్కల మల్లేష్‌గౌడ్, ప్రచార కార్యదర్శి విగ్నేశ్వర చారి, సంయుక్త కార్యదర్శి బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా బాలముకుందం, సంగనముని ఆంజనేయులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ.. మానవ హక్కుల రక్షణ, అధికారుల న్యాయబద్ధమైన, పారదర్శకత కలిగిన పనితీరును సామాన్య ప్రజలకు అందించడమే ఐహెచ్‌ఆర్‌ఓ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.

జాతీయ నాస్తికమేళాను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: గుంటూరు జిల్లా చార్వాకాలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే 32వ జాతీయ నాస్తిక మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం నాస్తిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈమేరకు ఆసంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ భారత పౌరులలో శాస్త్రీయమైన ఆలోచన నింపడానికి 1973లో ప్రగతి విద్యావనం స్థాపించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ విద్యావనమే చారువాకంగా రూపుదిద్దిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అయోధ్య రామాలయం సాకుతో దేశంలో మత విద్వేషాలు పెంచిపోషిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, బుచ్చన్న, ప్రసాద్, అజయ్, రాజు, సౌలు, రమేష్, ప్రకాష్, కుతుబ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఆత్మకూర్: కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త అబ్దుల్‌రావూఫ్(59) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్రక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, షబ్బీర్, కలీం, షంషీర్, దస్తగిరి, సమద్, కుర్షీద్, రహీం ఉన్నారు.